


# పరిష్కారం లేని సమస్య

'ఏమే, ముందు వచ్చిన చెవులు కంటె వెన కొచ్చిన కొమ్ములు వాడిట–అందరిళ్ళు చేసుకుని ఎనిమిది గంటలకా వస్తావు? ఏమిటే నీ ఉద్దేశం, పని చెయ్యాలని వుందా లేదా అసలు? పిల్లలు ఎనిమిది గంటలకల్లా స్కూలుకి వెళ్ళాలి, వంట చెయ్యాలి అని తెలుసుండీ యిప్పుడటే వస్తావు? ఒక్కొక్క గిన్నె కడుక్కోడం, వండుకోడం, నే తోముకునే మాటయితే నీవెందుకు, పని తిన్నగా చేస్తావో లేదో చెప్పేయి, ఇంక వూరుకోను.' ఎనిమిది గంటలకి సావకాశంగా గుమ్మంలోకి వచ్చిన సీతాలుని గుమ్మంలోనే నిలబెట్టి దులిపేసింది పద్మావతి. తనిల్లు ముందు వప్పుకుని మరో రెండిళ్ల చేసుకుని వస్తున్న సీతాలుని చూసి ఉక్రోషంగా కడిగేసింది.

'నానేటి సేస్తానమ్మగోరూ. ఆ లతమ్మగోరు ఆల్లాయనతో దెబ్బలాడి పెట్టెబేడ సర్దుకుని పుట్టింటి కెల్లిపోనాది. బెడ్డింగుకట్టి, అదట్రా, యిదట్రా అంటూ ఊదరగొట్టింది. టాక్సీ తెమ్మని పంపిందామ్మ. ఆయమ్మ ఎల్లేవరకు వదిలిందిగాదు––యీ పని ఆ పని సేయించుకుంటూ. ఈపూట ఆలీశం అయిపోనాది' అంది సీతాలు. పద్మావతి కోపం చప్పున దిగజారిపోయింది. కుతూహలంగా, ఆశ్చర్యంగా సీతాలు వేపు చూస్తూ 'ఏమిటీ లతమ్మ పుట్టింటికెళ్ళి పోయిందా. అదెప్పుడే. ఏమయిందీ. ఆయనతో [illegible] దెబ్బలాడింది. ఏం జరిగిందీ....' చాలా



ఓ. కామేశ్వరి

కుతూహలంగా వంట పని కూడా మరిచిపోయి అడిగింది. అమ్మగారి కోపం తగ్గిపోయిందని గుర్తించిన సీతాలు సావకాశంగా అంట్లు తీసికెళ్ళి కొళాయిదగ్గిర పడేసుకుంటూ 'ఏంటో నమ్మగోరు, గొప్పింటోళ్ళు. ఆల్లగొడవలు మాకేటి తెలుస్తాయి? ఆయమ్మ ఎప్పుడూ అయ్య మీద సిర్రుబుర్రు లాడతానే వుంటుంది. అయ్య మంచోడే. అమ్మే కయ్యానికి కాలు దువ్వుతుంటుంది ఎప్పుడూ. రోజుకోసారన్నా దేనికోదానికి దెబ్బలాటలేందే ఆ అమ్మకి తోచదుగా మోలు. అయ్య వూరుకున్నా రెచ్చగొడ్తుంది. యీ ఏల ఏటయిందో గాని, పెద్ద నోరెట్టుకుని పడగ్గదిలో ఏటో అరుసుకున్నారు యిద్దరూ. అయ్య బైటికివచ్చి 'ఇదిగో లతా వూరుకుంటున్నాని మరీ రెచ్చిపోతున్నావు దేనికన్నా హద్దుంది. నీ బెదిరింపులు చాలించు. పోతాను పోతాను అన్నవాళ్ళని ఎన్నాళ్ళుపట్టి ఆపగలను. మహారాజులా వెళ్ళు. డబ్బుందనిగదూ నీ మిడిసిపాటు, మొగుడక్కరలేదనుకుంటే మహారాజులా వెళ్ళు. అంతేగాని బెదిరించకు. యిదే ఆఖరుసారి చెప్పడం.' అని కేకలెట్టారు. ఆ యమ్మ విసవిస పైకి వచ్చి 'బెదిరింపు కాదు చేసి చూపిస్తాను. మీరేమన్నా గతిలేక పడుంటానని అనుకోకండి. మీ మగతనం, గొప్ప నా దగ్గిరకాదు. అందరిలా ఏమన్నా పడుంటానని అనుకోకండి. మీకు పెళ్ళాం అక్కరలేదనుకుంటే పట్టుకు వేళ్ళాడేంత దద్దమ్మని కాను. అంత ఖర్మాపట్టలేదు.' అంటూ ఏటేటో అంటు దబదబ పెట్టెలు లాగి సర్దేసుకుందమ్మగోరూ. ఆ బాబు వల్లకున్నాడు. ఆఖరున ఆ బాబే పాపం తగ్గిపోనాడు. 'ఏమిటి లతా బాగా ఆలోచించావా....నీకింత మూర్ఖత్వం పనికిరాదు' అంటూ నచ్చచెప్పబోనాడు, ఆ అమ్మ ఇనుకోకుండా చెయ్యి యిసిరికొట్టి చరచర టాక్సీలో కూకుని ఎల్లిపోనాది....ఆ అమ్మ ఎంతకన్నా తగునమ్మగోరు....అమ్మో....ఓ మొగుడు భక్తి, గౌరవం నేకుండా ఎప్పుడూ కసిరికొడ్తుంది....' సీతాలు సినిమా కథలా వర్ణించి చెప్తుంటే పద్మావతి చాలా కుతూహలంగా వింది. పద్మావతి అనాగరికురాలు, చదువు సంస్కారాలు లేనిదేంగాదు. పరాయియింటి విషయాలు మనకెందుకు అనుకునేపాటి సభ్యతా సంస్కారాలు తెల్సినదే. కాని, పద్మావతి ఆడది. ఏం చదివినా, ఏం చేసినా పొరుగింట్లో ఏదో గొడవ జరుగుతూంటే అందులో భార్యాభర్తల గొడవలనగానే కుతూహలం చూపకుండా వుండలేకపోయింది. అది స్త్రీ నైజం. అంతేకాక ఆ కుటుంబంతో కాస్తో కూస్తో పరిచయం వుంది కనక, లత స్వభావం కొద్దిగా తెలుసు కనక-భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో అన్న కుతూహలం నిలవనీయక సీతాలుని ప్రశ్నల మీద ప్రశ్నలు అడిగింది.

'అమ్మా - స్కూలికి టైమవుతూంది అన్నం పెట్టమ్మా' అన్న కొడుకు కేకతో ప్రశ్నలు చాలించి వంట ఇంట్లోకి వెళ్ళింది పద్మావతి - పిల్లలు భోంచేసి వెళ్ళాక ఆ కబురు భర్తతో చెప్పేవరకు తోచలేదు ఆమెకి - 'అరే - అదెప్పుడు - వెళ్ళిపోయిందా నిజంగా' అన్నాడు ఆశ్చర్యంగా

రామారావు. 'నిజంగానేనా ఏమిటి, సీతాలు చెప్తుంటేనే.... మొత్తానికి బలే ఆవిడ - ఏం ధైర్యం అలా యిల్లు వదిలిపోవడానికి - ఎవరన్నా ఏమన్నా అనుకుంటారన్న భయమైనా లేకుండా....' ఆమె ధైర్యానికి మెచ్చుకుంటుందో - నిరసిస్తుందో పద్మావతికే తెలియకుండా అంది.

"హు....యీ ఆడవాళ్ళకి కాస్త చేతిలో డబ్బు ఆడిందంటే యింక ఎవర్నీ లెక్కచెయ్యనక్కరలేదన్నట్టు ప్రవర్తిస్తారు. డబ్బుంటే యీ మొగుడి లెక్క ఏమిటన్నట్టు ఎదిరిస్తారు' .... రామారావు ఏదో అనబోయాడు. 'ఆ....ఆ....డబ్బులేకపోతే బానిసలా, కాలికింద చెప్పులా, వంటలక్కలానూ చూస్తారు - అదీ ఒప్పుకోండి మీరు - మీమగాళ్ళు మాత్రం ఏం తక్కువ వాళ్ళా? పాపం ఆ సుగుణని చూస్తే ఎంత జాలేస్తుంది." రామారావు మాటల్లో అబద్ధం లేకపోయినా అంత త్వరగా ఆ మాటల్లో నిజం ఒప్పుకోడం ఇష్టం లేక ఆడవాళ్ళని వెనవేసుకు వస్తూ అంది పద్మావతి.

"అవునవును నాకూ సుధాకరరావుని చూస్తే జాలేస్తుంది" వెక్కిరించాడు.

"వెక్కిరించక్కరలేదు. సుధాకర్ కేం లత వెళ్ళిపోతే మరో గీతని తెచ్చుకుంటాడు. పాపం సుగుణ గతిలేక ఆ మొగుడేం చేసినా అలా పడుండాల్సిందే కదూ?" రెట్టించింది పద్మావతి.

"ఏం పెళ్ళాం మొగుణ్ని వదిలి వెళ్ళిపోయిందంటే ఆ అవమానం తక్కువదనుకుంటున్నావా? పాపం ఆ మానవుడు రేపటినుంచి ఎలా మొహం ఎత్తుకుంటాడనుకుంటున్నావు. ఏం ఆడదానికేనా అవస్థలు - మగాడికేం సమస్యలు లేవనుకుంటున్నావా? ఆ లతకి డబ్బుందనే గాదూ అలా చిన్న విషయానికి ఇల్లువదిలిపోయింది. లేకపోతే సర్దుకునే విషయానికి అంత ధైర్యంగా తెగించి వెళ్ళిపోతుందా, అందుకే ఆడదాని చేతిలో డబ్బు మగాడి చేతిలో బిడ్డ - అన్నారు' ఎత్తి పొడిచాడు రామారావు వ్యంగ్యంగా.

"చాల్లెండి అసలు సంగతి తెలియకుండా లతదే తప్పని ఎందుకనుకోడం? ఏం జరగందే ఆవిడ మాత్రం అంతలా తెంచుకుపోతుందా' లత స్వభావం తెలిసినా ఆ విషయం ఒప్పేసుకుని భర్త ముందు తేలిపోవడం యిష్టం లేదు పద్మావతికి. పద్మావతికి ఓ డిగ్రీ వుంది. ఆధునిక భావాలున్నాయి. స్త్రీ స్వాతంత్రం, మగాడి దురహంకారం, వగైరా వగైరా కబుర్లంటే చాలా యిష్టం. చేతికందిన పుస్తకం అల్లా చదువుకుంది. ఉత్తి చదవడమేకాదు కథలు రాస్తూంటుంది. పెద్ద రచయిత్రి కాకపోయినా కాస్త పేరు తెచ్చుకున్న రచయిత్రి కోవలోకి వస్తుంది. ఆమె కథల్లో ఏదో స్త్రీ సమస్య ఎత్తుకుని రాస్తూంటుంది ఎప్పుడూ. ఆడదానిలో లోపాలు తెల్పినా అవి ఒప్పుకోకుండా పురుషాహంకారం, జులుము, స్త్రీని ఎంత బానిసలుగా చూస్తున్నదీ, ఆర్థిక స్వాతంత్రం లేకపోవడం వల్ల స్త్రీల యిబ్బందులు, శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా స్త్రీ బలహీనురాలవడం ఆమెలో క్షమాగుణం, ఓర్మి, సహనం ఇవన్నీ పురుషుడు ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేసి ఎడ్వాన్ టేజ్ తీసుకుంటున్నదీ ఆమె కథలో ఎత్తి చూపేది.

పక్కింట్లో వున్న సుగుణని చూస్తే ఆమెకి ఎంతో జాలిగా వుండేది. ఆమె కథ ఓ నవల రాసి ఆ మొగుడికి బుద్ధి తెప్పించాలన్న ఆవేశం వచ్చేది ఆమెకి. ఏం చేసి ఆమె బతుకు చక్కదిద్దాలన్న ఆరాటంతో ఆలోచించేది. సుగుణ - పక్కింటి భాస్కరరావు భార్య. భాస్కరరావు సెక్రటేరియట్‌లో గుమస్తా. సుగుణ చదువు సంధ్య లేని అజ్ఞానురాలు కాదు. ఇంటర్ వరకు చదువుకుంది. అందగత్తె కాకపోయినా చలాకీగానే వుంటుంది. పరువు ప్రతిష్ఠ కల కుటుంబం నుంచే వచ్చింది. ఆమె తండ్రి వున్నంతలో కూతురి పెళ్ళిచేసి లాంఛనాలు గట్రా బాగానే ముట్టచెప్పాడు. భాస్కరరావు చూసి నచ్చి చేసుకున్నాడు. అలాంటివాడు పెళ్లాన్ని మాటలతో చేతలతో ఎందుకు హింసిస్తాడో, ఆమెలో ఏం లోపం వుందని ఆమెనంత చిన్నచూపు చూస్తాడో, ఆమె ఏం తప్పు చేసిందని అడుగడుగునా కాల్చుకుతింటాడో పద్మావతికి అర్థం కాదు.

పెళ్ళికాకముందు నుంచి భాస్కరరావు ఆ యింట్లో వుండేవాడు. అప్పుడప్పుడు రామారావుతో మాట్లాడేవాడు. శలవు పూట ఎన్నడన్నా వచ్చి కూర్చుని యిదీ అదీ మాట్లాడి కాఫీ తాగి వెళ్ళేవాడు. కాస్త పరిచయం పెరిగాక ఒంటరివాడని రామారావు ఏదన్నా పండగవస్తే భోజనానికి పిలిచేవాడు. ఏ పిండివంటన్నా చేస్తే భాస్కరరావుకి పంపమనేవాడు పద్మావతితో. ఏణ్ణర్థం తర్వాత సుగుణని పెళ్ళి చేసుకుని కాపురానికి తెచ్చుకున్నాడు. పద్మావతి పక్కన తనతో కాలక్షేపం దొరికినందుకు సంతోషించింది. సుగుణ మంచిది, నెమ్మదైనది, కలివిడిగా వుందని, మంచి తోడు దొరికిందని సంబరపడింది. తమ పనిమనిషిని, పాలవాడిని, చాకలిని, అన్నీ కుదిర్చింది. ఓ రెండు మూడు నెలలు భాస్కరరావు సుగుణ సరదాగానే వున్నారు. సినిమాలకి, షికార్లకి వెళ్ళేవారు. శలవుల్లో వచ్చి పద్మావతి యింట్లో టిఫిన్లు, పేకాట వగైరాలన్నీ జరిగేవి. తరువాత రానురాను భాస్కరరావులో ఏదో మార్పు కనిపించింది పద్మావతికి. ఈలోగా సుగుణ నెల తప్పింది. పనిమనిషి ఒకత్తే అవడం వల్ల పద్మావతి మామూలుగా 'సుగుణమ్మగారేం చేస్తున్నారే.' అంటూ అడిగేది అప్పుడప్పుడు. 'ఆయమ్మ ఏటో మొహం ఏల ఏసుకు కూకుందమ్మా-ఎందుకో ఏడ్సినట్టుందమ్మా. ఏటో ఆ బాబు ఏప్పుడూ సిరుబురులాడతానే వుంటాడు ఆ యమ్మ మీద' అంది ఒకసారి. పద్మావతికి ఆశ్చర్యం అన్పించింది. అప్పటి నుంచి సీతాలు సుగుణ భాస్కరరావుల సంగతి, వాళ్ళిద్దరి తగవులు, సుగుణ ఏడ్వడం ఏదో చెప్పేది. 'ఆ బాబు యియాళ కాఫిలో కూసంత పంచదార ఎక్కువైందని ఆయమ్మ మీద ఎగిరి కాఫి తాగలేదమ్మగోరు. పాపం సుగుణమ్మ కన్నీళ్ళెట్టుకుంది. ఆ బాబు చొక్కా బొత్తాలు కుట్టడం యీ యమ్మ మరిసిపోనాదంట తిట్టిపోశాడమ్మా.'

'ఏటో ఆ బాబు దేనికీ సర్దుకోడు. ఏన్నీళ్ళు ఏడెక్కువైతే కోపం, సల్లగుంటే కోపం కాఫిగ్లాసు చురికితే కోపం, అన్నం కసింత ముద్దయితే సిరాకు. ఏటమ్మగోరు ప్రతిదానికి అలా తైతై అని ఎగిరి పడ్తాడు ఆ బాబు. ఏటి మీరు కాపురం సెయ్యడం లేదా, మొగుడు పెల్లాలన్నాక మాటమాట వస్తది గాని యిలా పతిదానికి తప్పులెంచి తిట్టడం ఏటమ్మగోరూ.' ఇలా రకరకాలుగా వాళ్ళింట్లో జరిగే భాగోతం చెప్పుకొచ్చేది సీతాలు. పద్మావతికి ఆశ్చర్యం వేసేది మొదట్లో. వాళ్ళింటి సంగతులు పనిమనిషి ద్వారా కూపీలాగడం ఏమిటి ఛీ- అనుకునేది. కాని ఆమెకి తెలియకుండానే ఆ కబుర్లు మొదలుపెట్టగానే కుతూహలం ఆపుకోలేక అన్నీవినేది. ఒక్కోసారి అడిగి మరీ వినేది. వాళ్ళిద్దరితో వున్న పరిచయం వల్ల అయితేనేం, స్త్రీ సహజమైన కుతూహలం వల్లనైతేనేం ఆ కబుర్లు విని సుగుణ మీద జాలిపడేది. సీతాలు చెప్పే మాటల సారాంశం బట్టి భాస్కరరావు స్వభావం అంచనా కట్టడానికి ప్రయత్నించింది. సుగుణ తప్పు లేదన్నది అర్థం చేసుకుంది. ఓ రోజు సుగుణ ఇంటికి వెళ్ళేసరికి సుగుణ ఏడుస్తూ పడుకుంది. పద్మావతి రాగానే ఆమెకి మొహం చూపలేకపోయింది. ఆమె చెంప మీద ఐదు వేళ్ళ

గుర్తులు స్పష్టంగా కనిపించాయి పద్మావతికి. ఇన్నాళ్ళు తిట్టడం తప్ప కొట్టడం కూడా భాస్కరరావు చేస్తాడని వినని పద్మావతి ఆశ్చర్యపోయింది. ఆశ్చర్యంతోపాటు భాస్కరరావు మీద కోపం ముంచుకు వచ్చింది. సుగుణని చూస్తే జాలి ముంచెత్తింది. ఎంతో అడగ్గా అడగ్గా ఏడుపు మధ్య సుగుణ దాపరికం లేకుండా అంతా చెప్పుకొచ్చింది. అతని కుటుంబస్థాయి కంటె సుగుణ అంతస్తుస్థాయి కాస్త పైమెట్టు నుండడంతో అతనిలో అదోరకమైన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్. సుగుణ బావలు, అన్నలు కంటె భాస్కరరావు చిన్న ఉద్యోగంలో వుండడంతో చిన్నతనం ఫీలయి ఎవరితోనూ కలవకుండా సరదాగా వుండకుండా అత్తవారింట్లో మూతి ముడుచుకు కూర్చోడం, తనని ఎవరు చిన్న చూపు చూస్తారో అన్నట్టు-ఆధిక్యత చూపుకోడానికన్నట్టు అవసరం వున్నా లేకపోయినా అందరి ఎదుట సుగుణ మీద లేనిపోని అథార్టీ చూపి ఆమెని చిన్నపుచ్చడం, పండగకి మామగారిచ్చిన బట్టలు విసిరి కొట్టడం, పెళ్ళిలోనూ అతను, వాళ్ళవాళ్ళు ఇది చాలదు అది చాలదు అంటూ చేసిన అల్లరి పెట్టిన అవస్థలు-అన్నీ కథలాగ చెప్పుకొచ్చింది సుగుణ. కాపురానికి వచ్చిన తర్వాత కొత్తలో కూడా సుగుణ ఏ చిన్న తప్పు చేసినా క్షమించేవాడు కాడు. ప్రతి చిన్న విషయానికి కసరడం, చిరాకు పడడం తప్ప సౌమ్యంగా మాట్లాడడని, ఏం చేసినా అతని మాట లక్ష్యం లేకుండా ప్రవర్తిస్తున్నట్టు కోపగించేవాడని, చీటికి మాటికి మాటలు మానేసి, భోజనం మాని సుగుణని సాధించేవాడని అన్నీ చెప్పింది సుగుణ. పద్మావతి ఆశ్చర్యంగా వింది. 'ఇంతకీ ఏమిటంటావు కారణం అతనిలా ప్రవర్తించడానికి?' "హుఁ....నా ఖర్మ అనుకోవాలి అంతే. సగం ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ మిగతాది స్వభావం అనుకోవాలి. ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేస్తారు. ఏదన్నా తప్పు దొరుకుతుందా సాధిద్దామా అని ఎదురు చూస్తారు. పనివాళ్ళముందు, చాకలాడి ముందు, కూరలవాడి ముందు, పాలవాడి ముందు వీళ్ళువాళ్ళు ఎవరున్నా సరే-ఎంత మాటపడితే అంతా అనేస్తారు చిన్నబుచ్చుతారు. నాకెలా వుంటుంది చెప్పండి. నేనూ కొత్తగా పెళ్ళయి వచ్చినదాన్ని. నా భర్త నన్ను ప్రేమగా, గౌరవంగా చూడాలని వుండదా. చీటికి మాటికి తిడ్తుంటే నా మనసెలా వుంటుందో చెప్పండి." కన్నీళ్ళు పెట్టుకుంటూ అంది సుగుణ. "అన్నింటికి మరీ ఎందుకూరుకుంటావు? కాస్త గట్టిగా ఒకసారి చెప్పకపోయావా? అయినదానికి కానిదానికి తిట్టడం అనవసరం. నెమ్మదిగా చెప్పచ్చు. తిడితే కొడితే పడి వుండనని తెలియ చెప్పక పోయావా...." పద్మావతి అంది.

"అన్నీ అయ్యాయి అక్కయ్యగారూ. మొదట్లో ఆయన తిడితే అలిగి తిండి మానేసి పడుకున్నా ఆయన చీమ కుట్టినట్లయినా పట్టించుకోలేదు. తిన్నావా అని కూడా అడగలేదు. మరోసారి ఆయన దేనికో అనవసరంగా తిడితే పౌరుషం వచ్చి నెమ్మదిగా చెప్పకూడదూ అలా అరుస్తారెందుకు అన్నానంతే_'నోర్మూయ్ పొగరుగా ఎదిరిస్తావా' అని పట్టుకుతిట్టారు. ఇంకోసారి నాకు కోపం వచ్చి అరిచాను. చెంపఛెళ్ళుమనిపించారు. అభిమానంతో ఏడుస్తూ పడుకున్నా పట్టించుకోలేదు. ఆ మనిషికి సౌమ్యంగా మాట్లాడడం అన్నది తెలియదు-ఆయనెంత కసిరినా తిట్టినా పెళ్ళాం కనక నోరు మూసుకు సహించాలని ఆయన ఉద్దేశం-జవాబిస్తే పొగరు. ఎదిరిస్తే చెప్పుదెబ్బలు, ఏడిస్తే తిట్లు-ఆయనకి నిల్చుంటే తప్పు కూర్చుంటే తప్పు. ఊఁ అంటే ఒకతప్పు, జవాబివ్వకపోతే ఇంకో తప్పు. ఛీ....ఛీ....అక్కయ్యగారు ఆర్నెల్లకే నా మనసు క్రుంగిపోయిందండీ. ఐశ్వర్యాలు భోగభాగ్యాలు కోరలేదు. భర్తనించి ఆప్యాయత, అనురాగం కూడా కోరవద్దాక యింక ఆ కాపురంలో సామరస్యం ఏం వుంటుంది చెప్పండి. అందరి స్త్రీల మాదిరి భర్త ప్రేమ, అన్యోన్యత అన్న కనీసపు కోరికలు కూడా గగనకుసుమాలయితే ఆ భర్తని ఏ ఆడది ప్రేమిస్తుంది. ప్రేమతో విషమన్నా తగ్గించవచ్చన్న సూత్రం ఆయనకి తెలీదు. పెడసరం తప్ప సామ్యం లేదు. తిట్టి కొట్టి పనులు చేయించుకుంటే ఆ మొగుడ్ని ఏ ఆడది గౌరవించదన్న చిన్న నిజం కూడా ఆయనెరగరు. కాపురానికొచ్చిన నెల రోజులకే ఆయన తత్వం అర్థమైపోయింది. ప్రేమ, అనురాగం అన్న పదాలకి ఆయనకర్థం తెలియదు. మనిషికి నిలువెల్లా అహంకారం-మగవాడినని, మొగుడ్ని అన్న దురహంకారం తప్ప భార్యా మనిషేనన్న నిజం గుర్తించరు. ఇలాంటి వాళ్ళని ఎలా మార్చగలం అక్కయ్యగారూ.... ఆర్నెల్లకే పెళ్ళిమీద, మొగుడిమీద విముఖత ఏర్పడిపోయిందండీ...." దుఃఖంతో, విరక్తితో అంది సుగుణ.

"ఛా....ఛా....కొట్టడం వరకు వచ్చారంటే....

### పుట్టపర్తి కనకమ్మ



వ్యక్తి వికాసానికి వంశ పారంపర్యం, పరిసరాలు తోడ్పడతాయని అంటూ వుంటారు. శ్రీమతి పుట్టపర్తి కనకమ్మగారి విషయంలో ఈ మాట అక్షరాలా నిజమైంది. ఆమె తాతగారైన శ్రీ ధన్నాద రాఘవాచార్యులు కాశీలో గజారోహణ సత్కారం అందుకున్న మహా విద్వాంసులు. వారి వద్ద సంస్కృతాంధ్ర భాషలు క్షుణ్ణంగా అభ్యసించారు కనకమ్మ.

ఆమె భర్త శ్రీ నారాయణాచార్యులు కూడా మహా విద్వాంసులు. తన భర్త సాంగత్యంలో ఆమె తన పాండితికి మెరుగులు దిద్దుకున్నారు. స్వయంగా గొప్ప కవయిత్రి అయి వుండి కూడా ఏ మాత్రం ప్రచారం అభిలషించక పోవడం ఆమె నిరాడంబరతను చాటుతుంది. తన కవితలు వెలువరించడంలోకన్న భర్త రచనల్లో సాయపడడంలోనే ఆమె ఎక్కువ ఆనందం పొందుతారు.

కనకమ్మగారు రాసిన ఖండికలు-యశోధర పశ్చాత్తాపం, జీర్ణ విజయనగరం, రాతి రథం, కస్తూరి బా – మొదలైనవి 'అగ్నివీణ' పేరిట సంకలనంగా వెలువడి పలువురి మన్ననలు పొందాయి.

బాధాకరమైన విషయాన్ని కూడా సున్నితంగా తెలియజేస్తూ వాటిని మధురమైన గీతికలుగా తీర్చిదిద్దగల నేర్పు కనకమ్మగారి రచనలలో ద్యోతకమవుతుందని, విమర్శకులు అభిప్రాయ పడతారు.

శ్రీరాముడు ఆమె ఆరాధ్య దైవం. రామాయణం పలుమార్లు పారాయణం చేయడమే కాకుండా 'శ్రీరామ సుప్రభాతం' రచించారు ఆమె.

1975లో అంతర్జాతీయ మహిళా సంవత్సర సందర్భంగా "ఉత్తమ కవయిత్రి"గా ఆమెను మన రాష్ట్ర ప్రభుత్వం సన్మానించి గౌరవించింది.

—రావినూతల రాజ్యలక్ష్మి

భాస్కరరావుని నేనెంత మాత్రం క్షమించను. నీవెలా వూరుకుంటున్నావో, నేనయితేనా....'' పద్మావతి ఆవేశంగా అంది. సుగుణ అదోలా నవ్వింది. .... "మొదట్లో మీకంటె ఆవేశ పడ్డాను. పౌరుషపడ్డాను. కాని వూరుకోక ఏం చెయ్యలేనని త్వరలోనే తెల్సుకున్నాను. నేనే కాదు, ఆయనకీ అర్థమైపోయింది నేనేం చెయ్యలేనని.'' నిర్లిప్తంగా అంది - 'ఇదిగో అలా అమ్మమ్మలా మాట్లాడకు - ఏం చెయ్యలేకపోవడం ఏమిటి. చెయ్యి చేసుకుంటే మాట దక్కదని ఖచ్చితంగా చెప్పు. ఎంత భార్య అయినా మర్యాద యిచ్చి పుచ్చుకోవాలని చెప్పు - అసలింతదాకా రానీయడం నీదితప్పు. మొదటిసారి చెయ్యి చేసుకున్నప్పుడే హద్దులో పెట్టాల్సింది -అసలెందుకు కొట్టారు-అంత తప్పు ఏం చేశావు?' పద్మావతి ఆశ్చర్యంగా అడిగింది.

కారణం ఏమిటి - నేను కాస్త స్వతంత్ర భావాలు కలదాన్నని ఆయన కనిపెట్టారు. కాస్తో కూస్తో చదువుకున్నదాన్ని ముందునించి అదుపులో పెట్టక పోతే లొంగనని భయపడ్డారు. ఒకటి రెండు సార్లు జవాబులు చెప్పేసరికి ఆయన మగతనానికి తీరని అవమానం జరిగిపోయినట్లు ఫీలయి తను మొగుడినని నేను భార్యనని ఆయనకి నన్ను తిట్ట డానికి కొట్టడానికి అన్నింటికి హక్కు వుందని నిరూపించాలనుకున్నారు. అందుకే ఆయన ఏమన్నా నోరెత్తకుండా పడివుండకుండా కాస్త జవాబు చెప్పినా సహించేవారు కాదు. మొదటిసారి ఆ రోజు కూరలో ఉప్పు ఎక్కువైందని తిట్టారు. నేను రుచి చూసి ఆశ్చర్యంగా 'లేదే సరిగా వుందన్నాను.' అంతే ఆమాత్రందానికి ఫైరయి పోతూ 'నేనబద్ధం చెప్పాననా నీ ఉద్దేశం, నాకు రుచి తెలియదనా నీ ఉద్దేశం, కూర మొహం ఎరగననుకుంటున్నావా నీ బాబు యింట్లోనే తిండి తింటున్నారనుకుంటున్నావా - మాటకి మాట జవాబిస్తావా? మొగుడు ఏదన్నా వ్యతిరే కంగా చెప్పడమే గాబోలు మీ ఆడవాళ్ళ ఉద్దేశం, నీ ఆటలు నా దగ్గిర కావు. నీవేం చేసినా వూరుకునే టంత చవటని కాను.' ఆ ధోరణి ఏమిటో - అలా సాగిపోతూంటే అంత చిన్న విషయానికి అంత దూరం ఆయన ఎందుకు సాగదీస్తున్నారో అర్థం కాక ఆశ్చర్యంగా కోపంగా 'ఎందుకలా నోరు పారేసుకుంటారు యీ కాస్త విషయానికి' అన్నాను - అంతే జరగరాని అవమానం జరిగినట్లు అంటు చేత్తోనే చెంప చెళ్ళుమనిపించారు. నేను పౌరుషంగా 'కొడ్తారా' అని అరిచాను. ఇంకా కొడ్తాను నోర్మూయ్ అని మరోటి వేశారు. అదీ ఆరంభం. ఆయన ధోరణికి అసహ్యం పుట్టి నేను ముభావంగా వుంటే గర్వమని మరింత తిట్టడం, జవాబిస్తే పొగరనడం - ఆఖరికి నాకెంత విముఖత పుట్టిందో తెలుసా ఆయన మొహం చూస్తేనే అసహ్యంగా వుంది - ఆయన దగ్గిరకొస్తేనే చీదరింపుగా వుంది.'' సుగుణ మాటల్లో భాస్కరరావుపట్ల పెంచుకున్న ఏహ్యత స్పష్టంగా కన్పించింది. పద్మావతి నిట్టూర్చింది. ఏం చెప్పాలో అర్థం కాలేదు.

'పోనీ కాస్త బెదిరించి చూడకపోయావూ పుట్టింటికి వెళ్లిపోతానని. ఈసారి చెయ్యి చేసుకుంటే పెట్టె పట్టుకుని మీ వాళ్ళ యింటికెళ్ళు.'

'అదీ ఆలోచించానక్కయ్యా - పుట్టింటికెడితే ఎన్నాళ్లుంటాను, ఏడుగురు పిల్లల తండ్రి నన్నెన్నాళ్లు పోషిస్తారు. పోషించడం అటుంచి వాళ్లే కాపురం వదులుకు వస్తావా అని చివాట్లు పెట్టి పంపిస్తారు. ఒకసారి కాదని వెళ్ళిపోయి మళ్ళీ వచ్చానంటే యింకా యీయనకి లోకువైపోతాను. అవతల మానాన్న మామూలు మధ్యతరగతి సంసారి ఆయనకి భారమవుతాను. అంతేకాక కూతురు మొగుడ్ని వదిలి వచ్చిందంటే పరువు ప్రతిష్ఠలకి భంగం అనుకునే మధ్యతరగతి మానవులం మనం. సంఘంలో బతుకుతూ సంఘం కట్టుబాట్లు దాటితే సహించకుండా కాకుల్లా పొడుస్తారు. కష్టమో సుఖమో, స్వర్గమో నరకమో మొగుడి దగ్గిరా పడుండాలనే మనస్తత్వం మన వాళ్ళది. మొగుడ్ని వదిలిన ఆడదాన్ని గౌరవంగా చూసే స్థాయికి ఎదగని యీ సమాజంలో మొగుడ్ని ధిక్కరించి వెళ్ళి అటు తల్లిదండ్రులకి భారమై అవమానాలని, అవహేళనలని ఎదుర్కొంటూ బతికే బతుకు కంటె యిదే నయమేమో'

సుగుణ మాటల్లో అతిశయోక్తి, అబద్ధం కన పడలేదు పద్మావతికి. 'పోనీ కాస్త నీ కాళ్ళ మీద నీవు నిలబడేట్టు ఏదన్నా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే కాస్త భయం వుంటుంది. మనకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడంతో మగవాళ్ళకి మరీ అలుసయిపోతున్నాం.'

'ఉద్యోగం ఎవరిస్తారక్కయ్యా నాకు. ఇంకోటి యింటర్ చదువుకి నా మొహం చూసి ఉద్యోగం యిచ్చే వాళ్ళెవరు. మహా మహా పోస్టు గ్రాడ్యు యేట్స్ ఉద్యోగాలు లేకుండా వున్నారు గదా. పోనీ ఏదన్నా ఉద్యోగం దొరికిందనుకో. యీయన గారు ముందు ఒప్పుకోవాలి గదా. ఆయన ఒప్పినా ఒప్పుకోరు.''

'మరెలాగ...ఇలా చివాట్లు చెప్పుదెబ్బలూ తింటూ ఆత్మాభిమానం చంపుకుంటూ ఎన్నాళ్ళు బతుకుతావు. పెళ్ళయిన ఆర్నెల్లలోనే యిలా వుంటే ముందు ముందు ఇంకెలా వుంటుంది. ఏదో చెయ్యాలి సుగుణా.' అంది పద్మావతి బాధగా.

'చేసేది ఏముంది అక్కయ్యా. యీ దేశంలో ఆడదానిగా పుట్టాక ఒకసారి పెళ్ళంటూ జరిగాక అది తెంపుకోడం అంత సుళువు కాదని ఎన్ని కథలు చదవడం లేదు, ఎంతమందిని చూడడం లేదు? మనం వద్దనుకున్నా మన చుట్టూ వున్న వాళ్ళూరుకోరు. నయానో, భయానో ఆడదాని స్థానం భర్త దగ్గిరే అని గుర్తుచేసి తీసుకొచ్చి వదులుతారు.' విరక్తిగా అంది సుగుణ. 'కాస్త ధైర్యంచేసి ఏదన్నా చేద్దామన్నా, నా ఖర్మకొద్దీ త్వరలోనే తల్లినవబోతున్నాను. ఆ పిల్ల కోసమన్నా అన్నీ సహించి వుండాలి. తండ్రి కాని బిడ్డకి ఈ సంఘంలో గుర్తింపు వుంటుందా అక్కయ్యా' అంది దీనంగా సుగుణ. సుగుణ కూడా తనకంటె అన్ని కోణాలనించి ముందే ఆలోచించి నిస్సహాయంగా వూరుకుందని అర్థం అయింది పద్మావతికి. పద్మావతి నిస్సహాయురాలే అయింది.

ఆరోజునించి గత ఏడాదిగా సుగుణ పరిస్థితి రోజు రోజుకి మరీ హీనమవడం చూస్తూ కూడా నిస్సహాయంగా వూరుకోవడం మినహా ఏం చెయ్య లేక పోతున్నందుకు బాధపడేది పద్మావతి. భాస్కర రావు అయినదానికి కానిదానికి ప్రతీదానికి చెయ్యి చేసుకోవడం ఎక్కువైంది. ఆఖరికి పురిటికి పంప డానికి కూడా నానా గొడవచేసి సుగుణ తండ్రి వచ్చి కాళ్ళావేళ్ళా పడ్డాక తొమ్మిదో నెలలో పంపి, మళ్లీ నెలరోజుల లోపల తీసుకొచ్చి దిగబెట్టాలన్న ఆర్డరు వేసాడు. భార్య - తాళి చూలు, ఆడదాని కష్టసుఖాలు అర్థం చేసుకోకుండా మగ అహం చూపే అతన్ని ఏమాత్రం క్షమించలేకపోయింది పద్మావతి. భాస్కరరావుపట్ల విముఖత రోజు రోజుకి పెరిగి అతనితో మాటలు మానేసింది. ఒకసారి ఏదో స్కూలులో టీచరు పోస్టు ఖాళీ వుందని తెల్సి బలవంతంగా సుగుణచేత అప్లై చేయించింది. ఆ సంగతి తెల్సి భాస్కరరావు సుగుణ మీద ఎగిరిపడి - నన్ను కాదని ఉద్యోగం చేసే మాటయితే యింట్లోంచి వెంటనే నడు అని మెడపట్టి గెంటినంత పనిచేశాడు. అప్పటితో

సుగుణ అదృష్టం ఇంతేనని ఆ కాపురంలో అన్యోన్యత మరి లాభం లేదని గ్రహించింది పద్మావతి.

సుగుణకి ఆర్థిక స్వాతంత్రం లేకపోబట్టేకదా అతనంత హీనంగా చూస్తున్నాడు. అదే ఆమెకో ఉద్యోగమో, ఆస్తో వుంటే చీటికి మాటికి ఫో ఫో అని కుక్కని తరిమినట్లు తరిమేవాడు కాడుగదా అని రామారావుతో వాదించేది పద్మావతి.

కాని అటు సుధాకర్ సంసారం చూస్తే ఆడదానికి ఆర్థిక స్వాతంత్రం వున్నాముప్పే గాబోలు అనిపించేది ఒకోసారి ఆలోచిస్తుంటే.

సుధాకర్ రామారావు కొలీగ్. సుధాకర్ తండ్రి ప్లీడరు, పెద్ద ఆస్తిపరులు కాదు. మధ్యతరగతి సంసారి. సుధాకర్ యింజనీరు, సుధాకర్ మధ్యతరగతి సంసారి అయినా అతని భార్య మాత్రం గొప్పింటి నుంచి వచ్చింది. ఒకే కూతురు. లక్ష ఆస్తి, పెద్ద మేడ, పొలాలతో వచ్చిన భార్య. ఆ తండ్రి అసలు ఇల్లరికం అల్లుడిని తెచ్చుకుందామనుకున్నాడు గాని అలా అన్నీ వున్నవాడెవడు ఇల్లరికానికి అంగీకరించకపోవడంతో ఆఖరికి సుధాకర్ సంబంధం చేసుకున్నారు. సుధాకర్ అందగాడు, ఉద్యోగం మంచిది ఆస్తి తమకే బోలెడుందని సంతోషించి కూతురు పెళ్ళి చేశాడు. మొదటే సుధాకర్, అతనివైపు వాళ్ళు అతనికి అందగత్తె, అంత గొప్పింటి పిల్ల వచ్చినందుకు సంతోషించారు. ఆ సంతోషం రోజులు గడిచిన కొద్దీ అందరికీ అణగారిపోసాగింది. లత అడుగడుగున తన అంతస్తు హోదాతో అత్తవారు సరితూగరని చిన్నచూపు చూసేది. ప్రతిదానికి పుట్టింటి గొప్పలు చెప్పి వారితో పోల్చి చులకనగా, హేళనగా మాట్లాడేది. వారి అభిమానాన్ని ఆప్యాయతని అపార్థం చేసుకుని తన డబ్బుకోసం ఎగబడి మంచి చేసుకుంటున్నారనేది సుధాకర్‌ని కూడా ఏదో దయదల్చి చేసుకున్నట్టు అడుగడుగునా ఎత్తి పొడిచేది. తమ అంతస్తుకి తగదన్నట్టు హీనంగా మాట్లాడేది. ప్రతి చిన్న విషయానికి నా డబ్బు నా ఆస్తి – మీదెవడికి కావాలి – నా చీరలు నేను కొనుక్కోగలను, మీ ముష్టిచీరలు ఎవడికి కావాలి? ఛీ. ఛీ యీ చీర మీ యింట్లో పనివాళ్ళు కట్టుకుంటారు. యిదేం తిండి, యిదేం యిల్లు, యిదేం ఫర్నిచర్, యిలా కాపురానికొచ్చిన దగ్గిర నుంచి మొగుడ్ని సాధించేది. చిన్నచూపు చూస్తూ అడుగడుగున తన ఆధిక్యత చూపుతూ అవమానపరిచేది. పాపం సుధాకర్ భార్య అందగత్తె, ఐశ్వర్యవంతురాలు తన అదృష్టం కొద్దీ దొరికిందన్న భావన రెండు నెలలకే అణగారిపోయి – ఈ పెళ్ళి చేసుకుని పొరపా[illegible] చేశాను. అందుకే అంతస్తులు చూసుకోవాలంటారు అని బాధపడ్డం ఆరంభించాడు. ఎంత సర్దుకున్నా అహంభావి అయిన భార్యతో కాపురం అడుగడుగునా ముళ్ళబాట మీద నడకలా యాతనగా వుండేది అతనికి.

సుధాకర్‌తో ఆఫీసు పరిచయమే కాక యింటి ఎదురుగానే కనక రామారావు సుధాకర్ క్లోజ్‌గా వుండేవారు, పెళ్ళికాక ముందు వదినగారూ అంటూ పద్మావతితో అలా వంటింట్లోకి వచ్చి కావల్సినవి అడిగి చేయించుకు[illegible]నేటంత చనువుగా వుండేవాడు. పెళ్ళయ్యాక లత మాత్రం పద్మావతి తమ అంతస్తుకి తగదన్నట్టు దూరదూరంగా అంటీ ముట్టనట్లుండేది. సుధాకర్ ఎంత ప్రయత్నించినా పద్మావతిని దూరంగానే వుంచింది. పద్మావతి ఎన్నిసార్లు వచ్చినా లత ఆమె యింటికి వెళ్ళకపోవడంతో పద్మావతి లత స్వభావం, ఆమె అహంకారం అర్థం అయి, రాకపోకలు తగ్గించేసింది. సుధాకర్ మాత్రం అప్పుడప్పుడు వచ్చేవాడు. పెళ్ళయిన తరువాత సుధాకర్‌ని ఒక నెల రోజులు మాత్రమే సంతోషంగా చూసింది పద్మావతి. తరువాత తరువాత ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగులుగా, ఓడిపోయినవాడిలా కనిపించేవాడు. మొదట్లో కారణం తెలియకపోయినా లత దురుసుస్వభావం, అహంకారం గుర్తించాక భార్యాభర్తల మధ్య కలతలకి కారణం అర్థం అయి సుధాకర్‌పట్ల సానుభూతి ఏర్పడింది పద్మావతికి. అంతేకాక పనిమనిషి భార్యాభర్తల మధ్య తగవులు చెప్పేది అప్పుడప్పుడు. రానురాను లత ప్రవర్తన మరీ మితిమీరిపోతూందని పైనించి చూసిన పద్మావతికే అర్థం అవసాగింది. ఆవిడ ఫ్రెండ్సుతో పార్టీలు, పిక్నిక్కులు, సినిమాలు, షికార్లు - యింటి పట్టున వుండేది కాదు. క్లబ్బులకి వెళ్ళి అర్థరాత్రి అపరాత్రి వచ్చేది. సుధాకర్‌కి చెప్పకుండా కూడా వెళ్ళిపోయేది. ఆఫీసు నుంచి సుధాకర్ వచ్చే వేళకి ఒక్క రోజు యింటి పట్టునున్నట్టు పద్మావతి చూడలేదు. వంటమనిషి కాఫీ యివ్వడం, నౌకరు అవసరాలు చూడడం తప్ప ఇల్లు, భర్త, సంసారం ఏమీ పట్టించుకునేది కాదు ఆమె. అతని పరువు మర్యాద ఏమవుతాయన్నది కూడా గుర్తించకుండా ప్రవర్తించడం ఆరంభించాక – సుధాకర్ సహనం హద్దులు దాటాక భార్య ప్రవర్తనని క్షమించలేక అదుపులో పెట్టడానికి ప్రయత్నించాడు. అతని హద్దులు ఆజ్ఞలు తన దగ్గిర పనికిరావని నిర్లక్ష్యంగా తెగేసి చెప్పింది. దాంతో భార్యభర్తల మధ్య తగవులు ఆరంభించాయి. భార్యని కట్టడి చెయ్యలేక, ఆమె విహారాలని, నిర్లక్ష్యాన్ని ఆమోదించలేక లోలోపల కృశించిపోయే సుధాకర్‌ని చూసి రామారావు దంపతులు బాధపడేవారు. లోకం కోసం, పరువుకోసం ఆమె ఏం చేసినా చూసి చూడనట్లూరుకునేవాడు సుధాకర్. కొన్నాళ్ళు అతను తగ్గిపోవడం చూసి అది ఆమె విజయంగా భావించి మరింత పేట్రేగిపోయింది లత.

సహనానికన్నా హద్దు వుంటుంది. ఆ రోజుతో సుధాకర్ సహనం. హద్దులు దాటింది. క్రితం రోజు రాత్రి క్లబ్బు నుంచి పన్నెండు గంటలకి యిల్లు చేరింది లత. వూర్లో పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయిన మిస్టర్ అగర్వాల్ కారులో యింటికి వచ్చి నవ్వులతో, హాస్యాలతో టాటాలు బైబైలు చెప్పి యింట్లోకి వచ్చిన లతని చూసి సహించలేకపోయాడు. క్లబ్బులో మగవాళ్ళతో ఆమె నవ్వులు పరాచికాలు ఎన్నిసార్లు చూసి ఆమె ప్రవర్తనని ఆమోదించలేక, ఆమెకి నచ్చచెప్పలేక ఆఖరికి క్లబ్బుకే వెళ్ళడం మానేశాడు. అతను మానినా ఆమె వెళ్ళడం మానలేదు. క్లబ్బులో సుధాకర్‌ని చూసి అంతా అదోలా జాలిగా సానుభూతిగా చూసేవారు. అదంతా భరించడం అతనివశంలో లేకపోయింది. మిస్టర్ అగర్‌వాల్ సుధాకర్ పక్కన వున్న అతన్ని చూడనట్టే లతతో చనువుగా నవ్వుతూ హాస్యాలాడేవాడు. నీవే ఏమిటన్నట్టు అంతా తనని ఆమె భర్తగా గుర్తించకుండా ఓ అనామకుడిలా నిర్లక్ష్యం చేస్తుంటే సహించలేక లతతో అనేకసార్లు తగవుపెట్టుకున్నాడు. 'నలుగురితో కలివిడిగా వుంటే ఎవరన్నా సరదాగా మాట్లాడుతారు. మూతి ముడుచుకు కూర్చుంటే ఎవరికి అవసరం నీతో మాట్లాడడం - నేను సరదాగా వుంటానని అంతా నాతో సరదాగా వుంటారు. అది నీకు కుళ్ళు.' అంది లత హేళనగా.

'అంటే' రెట్టించాడు?

'నీ యిష్టం వచ్చింది నీవు చెయ్యచ్చు. అనవసరంగా బెదిరింపులు మాను. నీలా యింట్లో దద్దమ్మలా కూర్చోలేను. మగాళ్ళతో మాట్లాడినంత మాత్రాన నా పాతివ్రత్యానికేం భంగంలేదులే.''

'స్వేచ్ఛ అంటే యిదా, రోజుకో మగాడితో తైతక్కలాడడమా?'

'తైతక్కలాడలేదు. మోడర్న్ సొసైటీ

గురించి నీలాంటి మొహాలకేం తెలుస్తుంది. క్లబ్బులు పార్టీలు ఎరిగిన మొహాలైతే యిలా మాట్లాడరు.'

'లతా నిజమే, నిన్ను పెళ్ళాడే స్టేటస్ లేని వాడినని పదేపదే గుర్తు చెయ్యక్కరలేదు. యీ సంగతి పెళ్ళాడే ముందే చూసుకోవల్సింది. యిష్టపడి చేసుకున్నావు కనక యిప్పుడు నీ యిష్టం వచ్చినట్టు ఆటలాడితే నా యింట్లో సాగనీయను యింక.'

'సరే అయితే. నా యింట్లో సాగనీయను అంటే అర్థం-యిది నా యిల్లు కాదని గుర్తు చేస్తున్నావన్న మాట. నీవా మాట అన్నాక యింక గతిలేక వుంటాననుకోకు రేపే వెళ్ళిపోతాను.' లత తీవ్రంగా అంది. ఆ క్షణాన యింకేమన్నా ఆమె మరింత రెచ్చిపోతుందని సుధాకర్ వూరుకున్నాడు. ఉదయం లేస్తూనే పెట్టె సర్దుతున్న లతని చూసి కోపం ఆపుకోలేకపోయాడు. 'పెళ్ళి వివాహ బంధం అంటే నీ దృష్టిలో వున్న విలువ యింతేనన్నమాట. నీకు డబ్బుందని ఆస్తి వుందని మొగుడు లెక్క ఏమిటనుకుంటున్నావు. సరే వెళ్ళు, ప్రతి నిముషానికీ 'పోతాను. నీ లెక్క ఏమిట'న్న వాళ్ళని ఎంత కాలం పట్టి వుంచగలం. అభిమానం అనురాగం లోపించాక నీ కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని ఎన్నాళ్ళు దేబిరిస్తాను. లోకంకోసం, పరువుకోసం ఇన్నాళ్ళూ నీవేం చేసినా భరించాను. నాలో యింక ఓర్మి చచ్చిపోయింది. యిదే ఆఖరుసారి నీకు చెప్పడం, వెళితే వెళ్లు కాని మళ్ళీ యీ గుమ్మంలో కాలు పెట్టవని గుర్తించి వెళ్ళు'' సుధాకర్ చెప్పేశాడు. దానికీ భయపడక నిర్లక్ష్యంగా యిల్లువదిలి వెళ్ళిపోయింది లత.

''లతకి ఆస్తి వుంది. భర్త మీద ఆధార పడక్కరలేదనే గాదూ అంత సులువుగా యిల్లు వదిలి వెళ్ళిపోయింది. అదే మామూలు స్త్రీఅయితే ఆ తెగువ ఎలా వచ్చేది. అతని తప్పు లేకపోయినా తప్పు తనదే అయినా అంత నిర్లక్ష్యంగా కాపురం వదులుకుని వెళ్ళిపోవడానికి కారణం ఆమెకి డబ్బు వుండడంగాదూ. లేకపోతే యింత చిన్న విషయానికి ఆడది యిల్లువదిలి పోతుందా .... నీవు చెప్పు. ఆడదానికి ఆస్తి అనర్థాలకి హేతువే. మన వాళ్లు వెర్రివాళ్ళయి ఆడదానికి ఆర్థిక స్వాతంత్రం లేకుండా చెయ్యలేదు....కాపురాలు, సంసారాలు సాగాలంటే ఎవరో ఒకరు తగ్గాలి....' రామారావు అన్నాడు.

'అంటే మొగుడు కనక ఏం చేసినా ఆడదే పడుండాలి అన్నమాట. ఎవరో ఒకరు తగ్గాలన్నప్పుడు మొగుడూ తగ్గచ్చుగా....'రామారావు మాటల్లో నిజం వుందనిపించినా తగ్గిపోవడానికి అహం అడ్డువచ్చి రెట్టించింది పద్మావతి.

'చూడు, పెళ్ళికాక ముందు తండ్రో, అన్నో ఏ మాటా అనరా, తప్పుచేస్తే వాళ్లు మందలించరా అలాగే పెళ్ళయ్యాక భర్త వయసులో ఆమెకంటె పెద్దవాడు భార్యని ఏ విషయంలోనన్నా మందలిస్తే తప్పా, తండ్రి ఓ మాట అంటే బాధపడనివారు భర్త చిన్నమాట అంటే తప్పుపట్టడం ఎందుకు?'

''భర్త, యజమాని యివన్నీ మీ మగాళ్ళు పెట్టినవేగదా, సంసారంలో భార్యా భర్త లిద్దరూ రెండు బండిచక్రాలంటూనే మళ్ళీ యీ హెచ్చు తగ్గులెందుకు భర్తకి కోపం వచ్చినట్టే భార్యా మనిషే కనక కోపం వస్తే ఆ కోపాన్ని భర్త ఎందుకు భరించడు? మగ అహం మాత్రం మిమ్మల్ని వదలదే....'' ఏం చెప్తావన్నట్టు గర్వంగా చూసింది పద్మావతి.

'చూడు యిలా వాదనకు దిగితే తుది మొదలు అంతు పొంతు వుండదు. ఇందాక చెప్పానే భార్యకంటె వయసులో పెద్దవాడవడం, శారీరకంగా బలవంతుడవడం, అర్జనపరుడవడం భర్తని యింటి యజమాన్ని చేసాయి. ఇది ఈనాటిది కాదు.... ఇది యిప్పట్లో మారుతుందనీ అనుకోను. భార్య మాట భర్త వినకూడదని కాదు. వినకుండానూ వుండరు. ఎక్కడో భాస్కర్‌లాంటి వాళ్ళను చూపించి అంతా అలాంటి వాళ్ళేనని మగాళ్ళని నిందించడం మీ ఆడవాళ్ళకి ఫాషన్ అయిపోయింది యీ రోజుల్లో. భాస్కర్‌లాంటి మొగాళ్లున్నట్టే - లత లాంటి ఆడవాళ్ళుంటారు. ఎటొచ్చీ తేడా ఏమిటంటే భర్త భార్యని హింసిస్తే మీ ఆడవాళ్లు లోకం అంతా చాటుకుంటారు. అదే భార్య భర్తని హింసించి చిన్నపుచ్చి అవమానాలు పాలుచేస్తే ఆ భర్త తనలోతాను కుములుతాడు తప్ప పైకి చెప్పుకోడు. భర్త హింసించిన ఆడదానికి లోకం సానుభూతుంటుంది. అదే మొగాడయితే పెళ్ళాంని అదుపులో పెట్టుకోలేని చాతకాని వాడంటుంది లోకం. అందుకే మగాడు ఎప్పుడూ ఆడదాన్ని తన చెప్పుచేతల్లో వుంచుకుని గౌరవం కాపాడుకోవాలనుకుంటాడు. ఆమెని అదుపులో పెట్టడానికి అందుకే ఎప్పుడూ ప్రయత్నిస్తాడు. కుటుంబం నిలవడం కోసం, పిల్లల కోసం భార్యాభర్తలిద్దరూ కలిసి వుండడం కావాలి. భర్త ఎన్ని వేలు సంపాదించినా భార్యాబిడ్డల కోసం ఖర్చు పెడతాడు. కాని భార్యకి కాస్త డబ్బుందేసరికి తన డబ్బు, తన సంపాదన అన్నట్టు వేరు లెక్కలుపెట్టి గర్వం చూపిస్తుంది. అదే మీ ఆడవాళ్ళకి, మాకు తేడా.'' రామారావు ఉపన్యాసం యిచ్చాడు గర్వంగా.

రామారావు మాటల్లో ఎక్కడో నిజం వుందన్నది పద్మావతికి తట్టింది. అది అంగీకరించి తగ్గిపోవడం యిష్టం లేక ''అవును పావలా పూలకి, అర్థ రూపాయి గాజులకి, రూపాయి సినిమాకి, ఏభై రూపాయల చీరలకి అన్నిటికి మొగుడ్ని దేబిరిస్తూ, బతిమాలుతూ, ఆయనగారి కసుర్లు తింటూ మీచేతి కింద పడుంటే మీకు సంతోషం గర్వం. అందుకే మాకు సంపాదన, డబ్బు వుంటే సహించలేరు. ఎప్పుడూ ఆడది తమ చెప్పుచేతల్లో వుండాలంటే - ఆడదానికి ఆర్థిక స్వాతంత్రం వుండకూడదు అంటారు అవునా?' పద్మావతి సవాల్ చేసినట్లు అంది. రామారావు జవాబుకి కాస్త ఆలోచించాడు.

'లత విషయం చూడు. ఆవిడకి లక్షలు ఆస్తి వుంది. మొగుడు లేకపోయినా మహారాజులా దర్జాగా బతుకుతుంది. అంత డబ్బున్న ఆవిడ ప్రవర్తనని లోకం పట్టించుకోదు. అదే ఏ రెండు వందలో తెచ్చుకునే స్త్రీ భర్తని వదిలిపోవడానికి పదిసార్లు ఆలోచిస్తుంది. లతలా అంత నిర్లక్ష్యంగా ఎప్పటికీ వెళ్ళదు - అలా అని ప్రతి చిన్నదానికి భర్తని దేబిరించక్కరలేదన్న తృప్తి వుంటుంది.' విడమర్చి చెప్పబోయాడు రామారావు.

''భేష్. ఈ రోజునించి ఆడది రెండువందలు మించి సంపాదించరాదు అని రూలుపెడితే సరి గవర్నమెంటు' హాస్యంగా అంది పద్మావతి. సంభాషణ హాస్యంలోకి దిగింది. రామారావు నవ్వాడు.

''అంతే మరి. యీ సమస్యకి పరిష్కారం యింతే. కర్ర విరగకూడదు పాము చావాలంటే యిదే మార్గం. అక్కడితో మీ ఆటలుకట్టి నోరు మూసుకు కూర్చుంటారు. నీ సంగతే చూడు ఏవో కథలు రాసి వదో పాతికో సంపాదించుకుని నా డబ్బు అని గర్వపడతావుగాని నన్ను కాదని పైకి వెళ్ళే సాహసం నీకుందా. ఎంత గర్వంగా జవాబులు చెప్పినా యిల్లు విడిచి ఆ లతలా ధిక్కరించి వెళ్ళే స్తోమత నీకు లేక పోబట్టే యిలా వున్నావు. అమ్మో లేకపోతే యీ పాటికి నీవూ వెళ్ళేదానివే.' హాస్యంగా అన్నాడు రామారావు.

అతను హాస్యంగా అన్న మాట- నిజం అని తెల్సిన పద్మావతి 'ఆ....ఆ మీతో వాదన వేసుకుంటే వంట ఎవడు చేస్తాడు. పనంతా అలాగే వుంది.' అని యింక వాదన పెంచే శక్తిలేక వంటింట్లోకి వెళ్ళిపోయింది. □